సాక్షి నల్లగొండ

శుక్రవారం, 6, డిసెంబర్, 2024



భద్రతా ఏర్పాట్ల పరిశీలన

సీఎం నల్లగొండ పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లను గురువారం మల్టీజోన్–2 ఐజీ పరిశీలించారు. - 8లో



నలుగురికి జ్ఞానం పంచాలి

చదువుకున్నోళ్లంతా తమ జ్ఞానాన్ని మరో నలుగురికి పంచాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. - 8లో



అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

- ఎత్తిపోతల పథకానికి రేపు ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం
- సస్యశ్యామలంకానున్న 4 నియోజకవర్గాల్లోని 7 మండలాలు
- ఇప్పటికే పూర్తయిన టన్నెల్, పంప్‌హౌస్, రిజర్వాయర్
- పెరగనున్న భూగర్భజలాలు.. తగ్గిపోనున్న ఫ్లోరైడ్ సమస్య

కరువు నేలకు జలసిరులు



పంప్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన మోటార్



లక్ష ఎకరాలకు సాగునీరందించనున్న 'బ్రాహ్మణవెల్లెంల - ఉదయసముద్రం'

ఫ్లోరైడ్ రక్కసిని పూర్తిగా నిర్మూలించడంతోపాటు సాగునీటిని అందించేందుకు చేపట్టిన బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ఎత్తిపోతల పథకంలో ప్రధాన ఘట్టం పూర్తయింది. ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన బ్రాహ్మణ వెల్లెంల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పూర్తి కావడంతో రిజర్వాయర్‌లోకి 0.302 టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా నీటి పారుదల శాఖ ఏర్పాట్లు చేసింది. నాలుగు నియోజక వర్గాల్లోని ఏడు మండలాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ

వర్షా కాలంలోనూ నీటి ఆనవాళ్లను ఎరుగని పల్లెల్లోని లక్ష ఎకరాలకు సాగునీటిని అందించి రైతుల కష్టాలు తీర్చేందుకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టును మంజూరు చేశారు. నార్కట్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ వెల్లంల గ్రామ శివారులో 2007లో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, రూ.699 కోట్లతో 2008లో ప్రాజెక్టుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2009లో పనులను ప్రారంభించారు. మొదట్లో ప్రాజెక్టు నిర్మాణ పనులు వేగంగా సాగినా ఆ తరువాత కాలంలో నెమ్మదించాయి. ఎట్టకేలకు ప్రధానమైన పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టులో ఎంతో కీలకమైన పానగల్‌లోని ఉదయసముద్రం నుంచి అప్రోచ్ కెనాల్, సొరంగం, పంప్‌హౌస్ నిర్మాణం, మోటార్ల ట్రయల్ రన్, 486 ఎకరాల్లో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం వంటి కీలకమైన పనులు పూర్తి కావడంతో ప్రాజెక్టు ప్రారంభానికి సిద్ధమైంది.

నియోజకవర్గాల వారీగా ఆయకట్టు వివరాలు (ఎకరాల్లో)


నియోజకవర్గం	మండలం	మొత్తం
మునుగోడు	మునుగోడు	12,127
నల్లగొండ	నల్లగొండ	22,593
నకిరేకల్	నార్కట్‌పల్లి	33,519
నకిరేకల్	కట్టంగూర్	20,616
నకిరేకల్	రామన్నపేట	2,495
నకిరేకల్	చిట్యాల	5,866
తుంగతుర్తి	శాలిగౌరారం	2,784

మొత్తం 1,00,000 ఎకరాలు

ప్రాజెక్టు స్వరూపం ఇదీ..

నల్లగొండ మండలంలోని పానగల్ ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి 6.70 టీఎంసీల నీటిని ఎత్తిపోసి నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లోని నార్కట్‌పల్లి, నల్లగొండ, చిట్యాల, మునుగోడు, రామన్నపేట, కట్టంగూర్, శాలిగౌరారం మండలాల్లోని 94 గ్రామాలకు చెందిన లక్ష ఎకరాలకు సాగునీటిని అందించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. అందులో బ్రాహ్మణవెల్లెంల రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా 55 గ్రామాలకు, ఎడమ కాలువ ద్వారా 39 గ్రామాలకు సాగునీరు అందిస్తారు. నియోజకవర్గాల వారీగా చూస్తే నకిరేకల్ నియోజకవర్గంలో 58 గ్రామాలకు సాగునీరు అందిస్తారు. నలగొండ నియోజకవర్గంలో 17 గ్రామాలకు, మునుగోడు నియోజకవర్గంలో లిఫ్ట్ ద్వారా 16 గ్రామాలకు, తుంగతుర్తి నియోజకవర్గంలో మూడు గ్రామాలకు సాగు నీరు అందిస్తారు.





ఇంకా చేయాల్సి భూసేకరణ

ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల తవ్వకానికి 3,851 ఎకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,456 ఎకరాలు సేకరించారు. ఇంకా 2,395 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. కుడి కాలువ కోసం చిట్యాల, నార్కట్‌పల్లి, రామన్నపేట మండలాల్లో 25.5 కిలో మీటర్లు పొడవున భూమి సేకరించాల్సి ఉండగా, 11 కిలో మీటర్ల పొడవున భూసేకరణ పూర్తయింది. ఎడమ కాలువ కోసం నార్కట్‌పల్లి, మునుగోడు, చిట్యాల మండలాల్లో 6.5 కిలోమీటర్ల పొడవునా భూమిని సేకరించాల్సి ఉండగా, 4.5 కిలోమీటర్లు సేకరించారు.

ప్రారంభమయ్యేది ఇక్కడే..

ఉదయ సముద్రం పైభాగాన ఉన్న దండంపల్లి గ్రామం సమీపం నుంచి అప్రోచ్ ఛానల్ ప్రారంభమై 6.9 కిలోమీటర్ల దూరంలోని కట్టంగూరు మండలం పిట్టంపల్లి గ్రామం వద్దకు చేరుతుంది. అక్కడి నుంచి 10.625 కిలోమీటర్ల పొడవున సొరంగం ద్వారా నీరు నార్కట్‌పల్లి మండలం చౌడంపల్లి గ్రామం వద్ద సర్జ్‌పూల్‌కు చేరుతుంది. అందులోనుంచి డ్రాఫ్ట్ ట్యూబ్ టన్నెల్ ద్వారా నీటిని ఒక్కొక్కటి 16 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు మోటార్లతో 86 మీటర్ల ఎత్తుకు పంపింగ్ చేసి 1.12 కిలోమీటర్ల పొడవున ఏర్పాటు చేసిన రెండు డెలివరీ పైపుల ద్వారా బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసేలా రూపకల్పన చేశారు. ఇందులో ఈ పనులన్నింటితోపాటు విద్యుత్ సబ్‌స్టేషన్ కూడా పూర్తయింది. మోటార్ల ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించింది. ప్రాజెక్టును ప్రారంభించాక రిజర్వాయర్‌ను నింపే ప్రక్రియ ప్రారంభం కానుంది.

రూ.72 కోట్లతో మిగతా పనులు

ప్రాజెక్టులో మిగిలిన పనులను రూ.72 కోట్లతో పూర్తి చేసి మొదటి విడతలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ముందుగా నకిరేకల్ నియోజకవర్గంలో 23వేల ఎకరాలు, నల్లగొండ నియోజకవర్గంలో 24వేల ఎకరాలు, మునుగోడులో 3వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పూర్తికావాల్సిన కాలువలు



బ్రాహ్మణవెల్లెంల వద్ద దివంగత సీఎం రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన పైలాన్

- ప్రధాన ఎడమ కాలువ 290 మీటర్ల లెవల్ నుంచి ప్రారంభమై 18.70 కి.మీ దూరంలో మునుగోడు మండలం కిష్టాపూర్ గ్రామ చెరువులో కలుస్తుంది. ఈ కాలువ ద్వారా దిగువన ఉన్న నల్లగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల, మునుగోడు మండలాల్లో 43వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఈ ఎడమ కాలువ పొడవు 6.500 కిలో మీటర్లు కాగా, దాని డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, సబ్ మైనర్ల మొత్తం పొడవు 149.360 కిలో మీటర్లు. అందులో ప్రధాన కాలువపై 5.500 కిలో మీటర్లు, దాని డిస్ట్రిబ్యూటరీ కాలువ డి–1 పరిధిలో 10 కిలోమీటర్ల పొడవున తవ్వకం పనులు పూర్తయ్యాయి. మిగితా పనులు చేయాల్సి ఉంది.
- కుడి కాలువ మొత్తం పొడవు 25.530 కిలోమీటర్లు. ఇదీ తుంగతుర్తి నియోజకవర్గంలోని శాలిగౌరారం మండలం చెరువులో కలుస్తుంది. కుడి కాలువ డిస్ట్రిబ్యూటరీలు, మైనర్లు, సబ్ మైనర్ల మొత్తం పొడవు 226.100 కిలోమీటర్లు. అందులో ప్రధాన కాలువపై 9.070 కిలోమీటర్లు, దాని డిస్ట్రిబ్యూటరీ–డి2 పరిధిలో 2.100 కిలోమీటర్ల పొడవున కాలువ తవ్వకం పనులను పూర్తయ్యాయి. మిగిలా పనులను చేపట్టాల్సి ఉంది. దీని కింద నకిరేకల్, కట్టంగూరు, నల్లగొండ మండలాల్లో 57 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.



ఉదయ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్

న్యూస్‌రీల్

నేడు 'సీఎం కప్' సన్నాహక సమావేశం

నల్లగొండ టూటౌన్: ఈ నెల 7న గ్రామ స్థాయి నుంచి ప్రారంభం కానున్న సీఎం కప్ క్రీడాపోటీలకు సంబంధించి శుక్రవారం నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒలింపిక్స్ అసోసియేషన్, క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

ముగిసిన జీఎన్‌ఎం పరీక్షలు

నల్లగొండ టౌన్: నవంబర్ 25న ప్రారంభమైన జీఎన్‌ఎం పరీక్షలు గురువారంతో ముగిసినట్లు నల్లగొండ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ పర్యవేక్షణలో ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించిన సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నల్లగొండ అభివృద్ధికి నిధులివ్వండి

- సీఎంకు కంచర్ల భూపాల్‌రెడ్డి లేఖ

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణాభివృద్ధితో పాటు ఏఎమార్పీ కాల్వ వెడల్పు, లైనింగ్ కోసం నిధులు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన.. సీఎంకు బహిరంగ లేఖ రాశారు. నల్లగొండ పట్టణానికి వస్తున్న సీఎంకు హృదయ పూర్వక స్వాగతం తెలుపుతున్నానని పేర్కొన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రూ.250 కోట్లు, ఏఎమ్మార్పీ కాల్వ లైనింగ్‌కు రూ.1,500 కోట్లు, నల్లగొండ పట్టణాభివృద్ధికి రూ.250 కోట్లు, నల్లగొండ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి రూ.100 కోట్లు ప్రకటించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట రూరల్ : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. గర్భాలయంలోని ప్రతిష్ఠామూర్తులు ఆరాధన, నిజాభిషేకం, అర్చన చేసి భక్తులకు స్వయంభూల దర్శనం కల్పించారు. ముఖ మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, వేద ఆశీర్వచనం, తదితర కైంకర్యాలు గావించారు. రాత్రి శయనోత్సవం జరిపించి ఆలయాన్నిద్వారబంధనం చేశారు.

నేడు నలుగురు మంత్రుల పర్యటన

- సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించనున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, కోమటిరెడ్డి, పొన్నం
- బి.వెల్లెంల ప్రాజెక్టు, యాదాద్రి పవర్ ప్లాంట్, మెడికల్ కళాశాల సందర్శన
- నల్లగొండలో బహిరంగ సభ నిర్వహణపై అధికారులతో సమీక్ష

నల్లగొండ: నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారు. ఈ నెల 7న రెండు జిల్లాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటించనున్న నేపథ్యంలో నలుగురు మంత్రులు ఏర్పాట్లను పరిశీలించనున్నారు. ముందుగా నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లెంల గ్రామంలో బి.వెల్లెంల –ఉదయసముద్రం ఎత్తిపోతల పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించనున్నందున మంత్రులు ఆ ప్రాజెక్టును పరిశీలించనున్నారు. అక్కడ ఏర్పాట్లపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేయనున్నారు. అలాగే నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం ప్రారంభించనున్న మెడికల్ కళాశాల నూతన భవనాలను పరిశీలించడంతోపాటు కళాశాల పక్కనే ఉన్న రాజీవ్ ప్రాంగణంలో సీఎం హాజరు కానున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని దామరచర్ల మండలం వీర్లపాలెం యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని పవర్ గ్రిడ్ అనుసంధానం ప్రారంభోత్సవ ఏర్పాట్లను నలుగురు మంత్రులు సమీక్షిస్తారు.

ప్రారంభానికి సిద్ధమైన మెడికల్ కళాశాల

నల్లగొండ టౌన్: నల్లగొండలోని ఎస్‌ఎల్‌బీసీ వద్ద నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ మెడికల్ కళాశాల శనివారం సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు సిద్ధమైంది. అలాగే కళాశాల ఆవరణలోనే నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు శనివారం పర్యవేక్షిస్తారు.

మిర్యాలగూడలోనూ..

మిర్యాలగూడ: మిర్యాలగూడ నియోజకవర్గంలో శుక్రవారం ఉదయం నలుగురు రాష్ట్ర మంత్రులు పర్యటించనున్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో యూనిట్–2ను ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నందున ముందస్తుగా ఇక్కడ ఏర్పాట్లను పరిశీలించనున్నారు. అనంతరం మంత్రులు అక్కడ నుంచి మధ్యాహ్నం 12:30గంటలకు మిర్యాలగూడ పట్టణంలోని సూర్యతేజ రైస్ మిల్లులో ఏర్పాటు చేసిన కొత్త సైలోలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత 1.30గంటలకు రోడ్డు మార్గంలో సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు వెళ్తారు.

మారిన సీఎం బహిరంగ సభాస్థలి

సీఎం పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభాస్థలి మారింది. మొదట ఎన్జీ కళాశాలలో సభ ఏర్పాటు చేయాలని అనుకున్నప్పటికీ తర్వాత ఎస్‌ఎల్‌బీసీలోని రాజీవ్ ప్రాంగణాన్ని ఎంపిక చేశారు. అయితే ముఖ్యమంత్రి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా బ్రాహ్మణవెల్లంల చేరుకుని అక్కడ ప్రాజెక్టు డిస్టిబ్యూటరీ పనులు ప్రారంభిస్తారు. అక్కడ నుంచి దామరచర్ల మండలంలోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించి అక్కడ మీడియా సమావేశంలో మాట్లాడతారు. ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా నల్లగొండ ఎన్జీ కాలేజీ చేరుకుంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో వెళ్లి ఎస్‌ఎల్‌బీసీలో నిర్మించిన మెడికల్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. కనగల్, తిప్పర్తి మండలాలకు మంజూరైన ప్రభుత్వ కళాశాల నిర్మాణాలకు, ఇతర అభివృద్ధి పనులకు అక్కడే శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం మెడికల్ కళాశాల పక్కనే రాజీవ్ ప్రాంగణంలో లక్షమందితో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు.

తూకాలను నిశితంగా పరిశీలించాలి

నల్లగొండ టూటౌన్: వినియోగదారులు కాంటా రాళ్లు, తూకాలు, ప్యాకింగ్‌లను నిశితంగా పరిశీలిచాకే వివిధ వస్తువులు, పదార్థాలను కొనుగోలు చేయాలని తూనికలు, కొలతల (లీగల్ మెట్రాలజీ) శాఖ రాష్ట్ర అసిస్టెంట్ కంట్రోలర్ సిద్ధార్థ కుమార్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా గురువారం నల్లగొండలోని బస్టాండ్ ప్రాంతంలో వినియోగదారలకు తూనికలు, కొలతల్లో జరిగే మోసాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. ప్యాకెట్లపై తయారీదారుని చిరునామా, నికర బరువు, ప్యాక్ చేసిన నెల, గరిష్ట చిల్లర ధర, కస్టమర్ కేర్ సెంటర్ లాంటివి తప్పనిసరిగా చూడాలని కోరారు. తూనికలు, కొలతలకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు ఉన్నా తమ కార్యాలయం సెల్ : 9440575081, 9010651783 నంబర్లకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి పి.రామకృష్ణ, ఇన్స్‌పెక్టర్ వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కంప్యూటర్ కాంటాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సీఎం సభను విజయవంతం చేయాలి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- నల్లగొండ, బి.వెల్లెంలలో ఏర్పాట్ల పరిశీలన

నల్లగొండ: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి డిసెంబర్ 7వ తేదీతో ఏడాది పూర్తవుతున్న సందర్భంగా నల్లగొండ జిల్లాలో చేపట్టనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలో సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా జిల్లాలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారని, జిల్లా కేంద్రం సమీపంలో ఎస్‌ఎల్‌బీసీ రాజీవ్ ప్రాంగణంలో లక్ష మందితో బహిరంగ సభ నిర్వహించనున్న తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎస్‌ఎల్‌బీసీకి రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.4,540 కోట్లను మంజూరు చేశారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసాను ముఖ్యమంత్రి ప్రకటిస్తారన్నారు. మూసీ ప్రక్షాళన కోసం వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, ఆర్డీఓ అశోక్ రెడ్డి, డీఎస్పీ శివారాంరెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌ఎల్‌బీసీలో సీఎం బహిరంగ సభ స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, వీరేశం, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు

బి.వెల్లెంల ప్రాజెక్టుతో రెండు పంటలకు సాగునీరు



నార్కట్‌పల్లి : బి.వెల్లెంలలో పైలాన్ వద్ద మాట్లాడుతున్న మంత్రి, చిత్రంలో ఎమ్మెల్యేలు

నార్కట్‌పల్లి: నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఆయకట్టులో మాదిరిగానే బ్రాహ్మణ వెల్లెంల– ఉదయ సముద్రం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతులకు రెండు సీజన్లలో పంటలు సాగుకు సాగునీరందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈనెల 7న సీఎం రేవంత్‌రెడ్డి బి.వెల్లెంల ప్రాజెక్టును ప్రారంభించనున్న నేపథ్యంలో గురువారం ఆయన.. నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి బి.వెల్లెంల గ్రామం వద్ద హెలిపాడ్, నూతనంగా ఏర్పాటు చేసిన పైలాన్ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ ప్రాజెక్టును ప్రారంభిండంతో 17 ఏళ్ల నా కల నెరవేరబోతోందని, నా జీవితం ధన్యం కానుందన్నారు. బి.వెల్లెంల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువలతోపాటు కట్టంగూర్ మండలం అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. మంత్రి వెంట ఇరిగేషన్ సీఈ అజయ్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఈఈ గంధం శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ విఠలేశ్వర్, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, బండా సాగర్‌రెడ్డి, సట్టు సత్తయ్య, జేరిపోతుల భరత్, కోమటిరెడ్డి చిన్న వెంకట్‌రెడ్డి, కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నల్లబోతు సత్తయ్య, బొడిగె స్వామి ఉన్నారు.

తెలంగాణ చరిత్ర తెలుసుకోవాలి

రామగిరి(నల్లగొండ): విద్యార్థులు తెలంగాణ చరిత్రను తెలుసుకుని భవిష్యత్ తరాలకు అందించాలని నల్లగొండ నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ పిలుపునిచ్చారు. తెలంగాణ దర్శిని కార్యక్రమంలో భాగంగా గురువారం ఎన్జీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలోని యువ టూరిజం సభ్యులు జిల్లా కేంద్రంలోని ఛాయా సోమేశ్వరాలయం, ఉదయ సముద్రం, పచ్చల సోమేశ్వరాలయం, పానగల్ మ్యూజియం, లతీఫ్ సాహెబ్ దర్గాను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో చరిత్ర విభాగం అధ్యాపకులు, యువ టూరిజం సమన్వయకర్త నర్సింగు కోటయ్య, అధ్యాపకులు డా.అంకుస్, యువ టూరిజం సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటాం

- బి.వెల్లెంల ప్రాజెక్టు పూర్తికి అవసరమైన నిధులు కేటాయించాలి
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల: బ్రాహ్మణవెల్లెంల–ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయకుండా.. అసంపూర్తి ప్రాజెక్టును ప్రారంభించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాకు వస్తే అడ్డుకుంటామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హెచ్చరించారు. చిట్యాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ వేలాది కోట్ల రూపాయలతో దామరచర్లలో యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, నల్లగొండలో మెడికల్ కాలేజీ, ఉదయ సముద్రం ప్రాజెక్టు నిర్మాణ పనులను చేపడితే రూపాయి కూడా మంజూరు చేయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించడానికి రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం ప్రాజెక్టు ట్రయల్ రన్ చేయించామని పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితులకు రూ.300 కోట్ల పరిహారం, కెనాల్ పనులకు రూ.200 కోట్ల నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టును ప్రారంభిస్తే రైతులే బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ప్రశ్నించే ప్రతి పక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో చిట్యాల మున్సిపల్ వైస్‌చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, నాయకులు సుంకరి యాదగిరిగౌడ్, కొలను సతీష్‌గౌడ్, కందాటి రమేష్‌రెడ్డి, జిట్ట బొందయ్య, కొలను వెంకటేష్‌గౌడ్, కోనేటి ఎల్లయ్య, ఇరగదిండ్ల గణేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

క్లుప్తంగా

సాగర్ డ్యాం దిగువన డ్రోన్లతో సర్వే


సర్వే చేసేందుకు ఉపయోగిస్తున్న డ్రోన్

నాగార్జునసాగర్: సాగర్ డ్యాం దిగువన టెయిల్‌పాండ్ వరకు కృష్ణా నదిలో గుట్టలు, రాళ్లు, మట్టి ఏమేరకు ఉన్నాయో గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సర్వేను గురువారం నాట్కో కంపెనీ వారు డ్రోన్ కెమెరాలతో ప్రారంభించారు. ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో సాగర్ నుంచి దిగువకు టర్బైన్ల ద్వారా నీటిని వదిలితే విద్యుదుత్పాదన జరుగుతుంది. వాటిని రివర్స్ తిప్పితే పంప్‌మోడ్‌లోకి వెళ్లి దిగువన నదిలో నీటిని ప్రాజెక్టులోకి ఎత్తి పోస్తారు. ఆ సమయంలో నదిలో ఉన్న రాళ్లు, మట్టి టర్బైన్లలోకి వచ్చే ప్రమాదం ఉంది. దిగువన నదిలో గుట్టలు, రాళ్లు, మట్టి ఏమేరకు ఉన్నాయి, రాబోయే రోజుల్లో టర్బైన్లు పంప్‌మోడ్‌లోకి మారినపుడు ఎలాంటి ఇబ్బందులు ఎదరవుతాయనే అంశాలపై సర్వే చేస్తున్నారు. నీటిపై ఎత్తులో డ్రోన్ ఎగురుతూ నీటిలో గల గుట్టలు, మట్టి, రాళ్లు తదితర వాటిని గుర్తిస్తూ ఫొటోలు తీస్తున్నారు. నాట్కో కపెంనీ వారు సర్వే చేసి జెన్‌కోకు నివేదికను అందజేస్తారు. వారం రోజుల పాటు సర్వే జరుగనున్నట్లు సమాచారం.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

ఆత్మకూరు(ఎం): ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్లెర్ల గ్రామానికి చెందిన చాడ స్వామి(52) గత రెండేళ్లుగా ఆస్తమా వ్యాధితో బాధపడుతున్నాడు. వారం నుంచి ఆస్తమా ఎక్కువ కావడంతో భరించలేక బుధవారం రాత్రి తన వ్యవసాయబావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబ సభ్యులు గమనించిన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యూఎన్‌సీసీ వర్క్‌షాప్‌లో పాల్గొన్న చౌటుప్పల్ వాసి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విదేశీ ప్రతినిధులతో సెల్ఫీ తీసుకున్న బొల్లోజు శ్యాంకుమార్

చౌటుప్పల్: థాయిలాండ్ దేశ రాజధాని బ్యాంకాక్‌లో ఈ నెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు జరిగిన యునైటెడ్ నేషన్స్ కాన్ఫరెన్స్ సెంటర్ (యూఎన్‌సీసీ) వర్క్‌షాప్‌లో చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన హెచ్‌ఆర్‌సీ రైట్ టు ఇన్ఫర్మేషన్ ట్రస్ట్ చైర్మన్ బొల్లోజు శ్యాంకుమార్ పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో సముద్ర హక్కుల పరిరక్షణ, మానవ హక్కుల రక్షణ వంటి అంశాలపై ఆయన మాట్లాడారు. సముద్రాలలో మానవ హక్కుల అమలు అనే అంశంపై శ్యాంకుమార్ తన సందేశాన్ని ఇచ్చారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనడం ద్వారా మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంతర్జాతీయ అంశాలపై అవగాహన వచ్చిందని శ్యాంకుమార్ తెలిపారు.

చదువుకున్నోళ్లు నలుగురికి జ్ఞానం పంచాలి

- ఎమ్మెల్సీ కోదండరాం


అశోక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం, కూరెళ్ల విఠలాచార్య తదితరులు

రామన్నపేట: చదువుకున్నోళ్లు తమ జ్ఞానాన్ని నలుగురికి పంచాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఇటీవల ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందిన రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన నకిరేకంటి అశోక్‌కు గురువారం గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బుద్ధ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నకిరేకంటి అశోక్‌కు అంగవైకల్యం ఉన్నప్పటికీ కుంగిపోకుండా పట్టుదలతో చదివి పీహెచ్‌డీ పూర్తిచేయడం నేటి తరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఒకే అంశంపై అనేక విషయాలను శోధించి రెండు వందలకు పైగా పేజీలతో పరిశోధనా గ్రంథం రాయడం అంత తేలికైన విషయం కాదని.. దీనికి ఎంతో ఓర్పు, పట్టుదల ఉంటేనే సాధ్యమవుతుందని వివరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ.. మంచి మనసుతో చేసే పనులు మంచి ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు డాక్టర్ చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. అశోక్ తన పరిశోధనా గ్రంథం ద్వారా దివ్యాంగులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలనే బాధ్యతను పాలకులకు గుర్తుచేశాడని తెలిపారు. అనంతరం రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు, తమ సమస్యలను పరిష్కరించాలని సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. మాజీ సర్పంచ్ కూరెళ్ల నర్సింహాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బ్రహ్మానందం, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేశపాక శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు హన్మంత్‌రెడ్డి, డేవిడ్, తవుటం భిక్షపతి, ఎస్‌కే చాంద్, జేఎస్ మార్టిన్, తలారి గణేష్, బండ్ల కృష్ణ, నకిరేకంటి నరేందర్, కొంగరి నిరంజన్, వనం వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ భద్రతా ఏర్పాట్ల పరిశీలన


సీఎం సభ రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

నల్లగొండ క్రైం: సీఎం రేవంత్‌రెడ్డి శనివారం మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి హోదాలో నల్లగొండ జిల్లా కేంద్రానికి వస్తున్న సందర్భంగా భద్రతా ఏర్పాట్లను గురువారం ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ పరిశీలించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సాగర్ రోడ్డులో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభోత్సవం, నర్సింగ్ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం సీఎం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ సభకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ స్థలాన్ని ఐజీ పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై అధికారులు, స్థానిక నాయకులతో చర్చించారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంలలో ఉదయ సముద్రం ఎత్తిపోతల ప్రాజెక్టును కూడా సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో అక్కడ కూడా భద్రతా ఏర్పాట్ల గురించి చర్చించారు. ఎన్జీ కాలేజీలో హెలికాప్టర్ నుంచి దిగి రోడ్డు మార్గాన ముఖ్యమంత్రి ప్రభుత్వ వైద్య కళాశాల వద్దకు చేరుకుంటారు. సభ ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, ఎస్బీ సీఐ రాఘవరావు, సీఐ దానిమేల్, చిట్యాల సీఐ నాగరాజు, రూరల్ ఎస్ఐ సైదాబాబు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టను సందర్శించిన దేవాదాయ కమిషనర్


దేవాదాయ కమిషనర్ శ్రీధర్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ ఈ. శ్రీధర్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఆయనకు సాంప్రదాయ రీతిలో స్వాగతం పలికారు. అనంతరం ప్రధానాలయంలోని స్వయంభూవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి వేద ఆశీర్వచనం చేయగా, ఈఓ భాస్కర్‌రావు స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని, స్వామి వారి ఫొటోను కమిషనర్‌కు అందజేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

హాలియా : హైదరాబాద్‌లో ఈ నెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్న 71వ అంతర్ జిల్లాల మహిళా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు నల్లగొండ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. భూలోకరావు, జి. కర్తయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జిల్లా మహిళా కబడ్డీ జట్టు హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనున్నట్లు వారు తెలిపారు. ఎంపికైన వారిలో కెప్టెన్‌గా ఎస్‌కే ఆయేషా (అలీనగర్), కె. అంజలి (దుగ్గెపల్లి), ఎం. స్వాతి (మిర్యాలగూడ), ఎన్. కీర్తి (ఇబ్రహీంపేట), టీ. హన్సిక (తిరుమలగిరి), ఆర్. నందిని (మల్లేపల్లి), ఎం. అభినయశ్రీ (కట్టంగూర్), ఎండీ అఫ్సా(అలీనగర్), మౌనిక (నల్లగొండ), సాయి అభిజ్ఞ (దేవరకొండ), పూజ (దేవరకొండ), పావని (యాద్గిర్‌పల్లి), స్టాండ్ బైగా ఆర్. లక్ష్మి (మిర్యాలగూడ) ఉన్నారు. కోచ్‌గా ఎండీ. అన్వర్‌ఖాన్, మేనేజర్‌గా నాగమణి వ్యవహరించనున్నట్లు తెలిపారు.

భూమి రిజిస్ట్రేషన్ చేయాలని వృద్ధ దంపతుల నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన వృద్ధ దంపతులు

సంస్థాన్ నారాయణపురం: తాము కొంత భూమి అమ్ముకుంటే.. ఆ భూమిని కొనుగోలు చేసిన వారికి తహసీల్దార్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయకుంటే ఆత్మహత్య చేసుకుంటామని వృద్ధ దంపతులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన జక్కిడి బాల్‌రెడ్డికి 40ఎకరాల భూమి ఉంది. తన కుమారుడు జక్కిడి శ్రీనివాస్‌రెడ్డికి 36 ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయగా ఇంకా బాల్‌రెడ్డి పేరు మీద 4ఎకరాల 10గుంటల భూమి ఉంది. కుమారుడు తమ బాగోగులు పట్టించుకోకపోవడంతో బాల్‌రెడ్డి తన పేరు మీద ఉన్న భూమిని ఇతరులకు విక్రయించాడు. భూమి కొనుగోలుదారు రిజిస్ట్రేషన్ కోసం బుధవారం స్లాట్ బుక్ చేసుకున్నాడు. గురువారం 12గంటలకు రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుక్ అయ్యింది. తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయకపోవడంతో బాల్‌రెడ్డి అధికారులను ప్రశ్నించాడు. రిజిస్ట్రేషన్ చేయవద్దని బాల్‌రెడ్డి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు చేశాడని, దీంతో రిజిస్ట్రేషన్ నిలిపివేస్తున్నానని తహసీల్దార్ తెలిపారు. తమ భూమి అమ్ముకుంటే ఎందుకు రిజిస్ట్రేషన్ చేయరంటూ తహసీల్దార్‌తో బాల్‌రెడ్డి వాదించాడు. వృద్ధ దంపతులు సుమారు మూడు గంటలకు పైగా తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. తాము ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. చివరకు రిజిస్ట్రేషన్ చేయడంతో కథ సుఖాంతం అయ్యింది. ఈ విషయమై తహసీల్దార్ కృష్ణను వివరణ కోరగా.. బాల్‌రెడ్డికి కుంటుంబ సభ్యులతో మాట్లాడుకోమని కొంత సమయం ఇచ్చామని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రకియ పూర్తిచేసినట్లు తెలిపారు.

రూ.100కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి వినతి


కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు రూ.100కోట్లు కేటాయించాలని నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు గురువారం ఢిల్లీలో వినతిపత్రం అందజేశారు. నాగార్జునసాగర్‌తో పాటు నల్లగొండ జిల్లాలోని పర్యాటక కేంద్రాలైన పానగల్, రాచకొండ, దేవరకొండ ఖిలాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రతేకంగా నిధులు కేటాయించి విడుదల చేయాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎంపీ తెలిపారు.

రెండు వైన్ షాపుల్లో చోరీ


వైన్ షాపు పైకప్పు రేకులు తొలగించిన దొంగలు

చింతపల్లి: మండల కేంద్రంలోని రెండు వైన్ షాపుల్లో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల కేంద్రంలో పక్కపక్కనే ఉన్న శ్రీసాయి వైన్స్, దుర్గ వైన్స్‌ల పైకప్పు రేకులను గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు తొలగించి లోనికి ప్రవేశించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి దుర్గా వైన్స్‌లో రూ.40వేల నగదు, 10 ఫుల్ బాటిళ్ల మద్యం, శ్రీసాయి వైన్స్‌లో రూ.15వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆయా వైన్ షాపుల యాజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతోనే నేల పదిలం


రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

త్రిపురారం: సేంద్రియ వ్యవసాయం చేస్తే భూసారాన్ని కాపాడుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం ప్రపంచ మృత్తిక(నేల) దినోత్సవం సందర్భంగా త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని రైతులకు నేల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేస్తూ సేంద్రియ ఎరువులు వాడితే భూసారం పెరుగుతుందన్నారు. భావితరాలకు ఆరోగ్యకరమైన నేలను అందించడానికి వ్యవసాయంలో మృత్తిక (నేల) పరిరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పార్వతి చౌహాన్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ, పల్లవి, హిమబిందు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్

- నిందితుడి నుంచి 19 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేటటౌన్: తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు ఈ కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఏఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న జనగామ జిల్లాకు చెందిన శీలంచెట్టి వెంకటరమణను పట్టణ సీఐ తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకొని విచారించగా.. 2021, 2022లో సూర్యాపేట పట్టణంలో రెండు దొంగతనాలు, సూర్యాపేట రూరల్ ప్రాంతంలో ఒక చోరీకి పాల్పడినట్లు నిజం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి సూర్యాపేట పట్టణ పోలీసులు రూ.15.20లక్షల విలువైన 19 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఏఎస్పీ తెలిపారు. నిందితుడిపై హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో 30 చోరీ కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు విచారణను పర్యవేక్షించిన సూర్యాపేట డీఎస్పీ రవితో పాటు నిందితుడిని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, వీరరాఘవులు, ఎస్ఐ ఏడుకొండలు, టెక్నికల్ టీం సిబ్బందిని ఏఎస్పీ అభినందించి రివార్డు అందజేశారు.

100 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

చిట్యాల: రైస్ మిల్లులోకి రేషన్ బియ్యం డంప్ చేస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. గురువారం నల్లగొండ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రాత్రి చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ శివారులోని ఓ రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి.. అదే సమయంలో ఖమ్మం జిల్లా తల్లాడ నుంచి డీసీఎంలో వచ్చిన రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లులోకి డంప్ చేస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన రేషన్ బియ్యం సుమారు 100 క్వింటాళ్లకు పైగా ఉండవచ్చునని సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ తెలి పారు. ఆరుగురిపై కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కాడెడ్ల వ్యవ'సాయం'


ఎద్దుల బండిలో సీసీఐ కేంద్రానికి పత్తిని తీసుకొచ్చిన రైతు ముంత మల్లేష్

మునుగోడు: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు వ్యవసాయంలో ఆధునిక యంత్రాలను వినియోగిస్తున్నారు. కానీ మునుగోడు మండలం చల్మెడ గ్రామానికి చెందిన రైతు ముంత మల్లేష్ ఇప్పటికీ వ్యవసాయ పనులన్నింటినీ కాడెడ్లతోనే కొనసాగిస్తున్నాడు. ఎంత కష్టమైనా ఎడ్లతోనే నాగలి కట్టి దుక్కి దున్నడం, ఎరువులు వేయడం, చేతికొచ్చిన పంటను ఎడ్ల బండిలోనే ఎంత దూరమైనా తరలిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మల్లేష్ తాను పండించిన పత్తిని గురువారం ఎద్దుల బండిలోనే తన స్వగ్రామానికి దాదాపు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న మునుగోడులోని సీసీఐ కేంద్రానికి తీసుకొచ్చాడు. దీంతో అతడిని అక్కడే ఉన్న పలువురు రైతులు అభినందించారు.

బండరాయితో మోది యువకుడి హత్య


పాచ్యానాయక్ (ఫైల్)

మఠంపల్లి: మఠంపల్లి మండలంలోని భీమ్లాతండాకు చెందిన యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు, తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమ్లాతండాకు చెందిన పానుగోతు పులిసింగ్ చిన్న కుమారుడు పాచ్యానాయక్(32) లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పాచ్యానాయక్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. భీమ్లాతండా సమీపంలోని సుల్తాన్‌పూర్ తండాకు వెళ్లే మార్గంలో గురువారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు పాచ్యానాయక్ తలపై బండరాయితో మోది హత్య చేశారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. పాచ్యానాయక్‌కు గ్రామానికి చెందిన కొంత మందితో రెండేళ్లుగా భూవివాదాలు నడుస్తున్నాయని, పలుమార్లు, నెల రోజుల క్రితం కూడా గొడవలు జరిగాయని.. వారే పాచ్యానాయక్‌ను హత్యచేసి ఉంటారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. హుజూర్‌నగర్ సీఐ గజ్జి చరమందరాజు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చి కుక్క దాడి.. ఏడుగురికి గాయాలు

భువనగిరి: పిచ్చి కుక్క దాడిలో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన భువనగిరి మండలం వడాయిగూడెంలో గురువారం జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వడాయిగూడెం గ్రామానికి చెందిన గుండు కృషిక, బందారపు బన్నీతో పాటు మొత్తం ఏడుగురిపై గురువారం రాత్రి పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. కృషికకు తీవ్ర గాయం కావడంతో భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో కుక్క కాటుకు వ్యాక్సిన్ లేదని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. గాయపడిన వారిలో కొంత మంది ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం.

భయంతో హాస్టల్ ఖాళీ చేసిన విద్యార్థులు


శాంతినగర్‌లోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్

అనంతగిరి: మండలంలోని శాంతినగర్ ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థి తిరుమలేష్ హాస్టల్ ట్యూటర్ నిర్లక్ష్యం వలన బావిలో పడి ఆదివారం మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో హాస్టల్‌లోని మిగతా విద్యార్థులు భయాందోళనకు గురై ఒక్కొక్కరుగా హాస్టల్‌ను ఖాళీ చేసి తమ ఇళ్లకు వెళ్లిపోయారు. తిరుమలేష్ మృతి చెందడంతో హాస్టల్ వార్డెన్ పద్మను ఉన్నతాధికారులు అదే రోజు సాయంత్రం సస్పెండ్ చేయగా.. కోదాడలోని మరో హాస్టల్ వార్డెన్ రమేష్‌ను శాంతినగర్‌లోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు ఇన్‌చార్జి వార్డెన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఆయన నేటివరకు చార్జి తీసుకోకపోవడం గమనార్హం. రమేష్‌కు ఇప్పటికే కోదాడ హాస్టల్ వార్డెన్‌గా పోస్టింగ్ ఇవ్వగా మఠంపల్లి, హుజూర్‌నగర్‌లో మూడు హాస్టల్స్‌కు ఇన్‌చార్జిగా ఉన్నారు. ఈ విషయమై డీఎస్‌సీ జిల్లా అధికారిలతను వివరణ కోరగా.. అన్ని ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్‌కు త్వరలో నూతన వార్డెన్‌లు రాబోతున్నట్లు తెలిపారు. విద్యార్థులు భయాందోళనకు గురికావడంతో తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకువెళ్లారని, వారితో మాట్లాడి హాస్టల్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గురువారం హాస్టల్‌కు ఐదుగురు విద్యార్థులు చేరుకున్నట్లు సమాచారం.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

భువనగిరి: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ గటన భువనగిరి మండలం చందుపట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. చందుపట్ల గ్రామానికి చెందిన మల్లెల మౌనిక (29)కు ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన మహేందర్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. మహేందర్ కుటుంబంతో కలిసి మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బోడుప్పల్‌లో అద్దెకు ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మౌనిక ఈ నెల 4వ తేదీన తన తల్లిగారి ఊరు చందుపట్లకు వచ్చింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని భువనగిరి రూరల్ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. మౌనిక మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి పట్టణ పరిధిలో గురువారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం పుష్‌పుల్ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించగా.. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే భువనగిరి హెడ్‌కానిస్టేబుల్ కృష్ణరావు తెలిపారు.. మృతుడి వయస్సు సుమారు 25 సంవత్సరాలు ఉంటుందని, 5.6 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు, ఎడమ చాతిపై పచ్చబొట్టు ఉందన్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు 9848222169, 8712568454 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అంగన్‌వాడీ టీచర్ టు జూనియర్ కళాశాల లెక్చరర్

- ఐదు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పెద్దవూర వాసి


భర్త, పిల్లలతో ఖాజాబేగం

పెద్దవూర: కృషి, పట్టుదల, అంకిత భావం ఉంటే ఏదైనా సాధించవచ్చనే దానికి నిదర్శనంగా నిలుస్తోంది పెద్దవూర మండల కేంద్రానికి చెందిన ఎండీ ఖాజాబేగం. ముగ్గురు పిల్లల తల్లి అయిన ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూనే ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించి ఔరా అనిపించింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఖాజాబేగంకు ఇంటర్మీడియట్ చదువు పూర్తి కాగానే తల్లిదండ్రుల వివాహం చేశారు. ఆమె భర్త ఎండీ షబ్బీర్ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌గా నెలకు రూ.12వేల వేతనంతో పనిచేస్తున్నాడు. ఎలాగైనా తన భార్యను ఉన్నత చదువు చదివించాలని ఖాజాబేగంను ప్రోత్సాహించి వివాహం అయిన తర్వాతే డిగ్రీ, బీఈడీ, రెండు పీజీలు సైతం చేయించాడు. భర్త నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముగ్గురు ఆడపిల్లలు సంతానమైనప్పటికీ మొక్కవోని దీక్షతో ఖాజాబేగం చదివింది. మొదట మినీ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తూనే కేజీబీవీలో సీఆర్‌టీ పోస్టుకు నోటిఫికేషన్ రావడంతో హిందీ విభాగంలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించింది. కేజీబీవీలో సీఆర్‌టీగా చేరి ఒకవైపు విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పుతూనే గురుకుల టీచర్ పోస్టులకు స్వతహాగా ప్రిపేర్ అయ్యింది. హిందీ పీజీటీ విభాగంలో 1:2 నిష్పత్తిలో సర్టిఫికేట్ వేరిఫికేషన్‌కు వెళ్లినా జాబ్ రాలేదు. టీజీటీ ఫలితాల్లో జిల్లాలో మూడో ర్యాంకు సాధించింది. హాలియాలోని బీసీ రెసిడెన్సియల్ గురుకుల పాఠశాలలో హిందీ టీజీటీగా ఉద్యోగంలో చేరి నాలుగు నెలలు విధులు నిర్వహించింది. మరోవైపు డీఎస్సీకి స్వతహాగా ప్రిపేర్ అయ్యి జిల్లాలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా నాలుగో ర్యాంకు సాధించి ఓపెన్ కేటగిరీలో ఉద్యోగం పొందింది. ప్రస్తుతం కొండమల్లేపల్లి మండలం చింతకుంట్ల జెడ్పీహెచ్ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ హిందీ టీచర్‌గా పనిచేస్తోంది. బుధవారం రాత్రి టీజీపీఎస్సీ విడుదల చేసిన ఫలితాలల్లో హిందీ ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం సాధించింది. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఐదు ఉద్యోగాలు సాధించింది. ఖాజాబేగంను పెద్దవూర గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.